పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రసన్న కుమార్, సంతోషి

నస్పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. శనివారం ఫలితాలు వెల్లడి కావడంతో గోనె ప్రసన్న కుమార్ (1735), ననకంటి సంతోషి (1872) పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామన్‌రావు తెలిపారు. అలాగే ఈ ఇద్దరు విద్యార్థులు ప్రస న్న కుమార్ (బాలుర టీజీఎస్ ఆర్‌జేసీ- బెల్లంపల్లి), సంతోషి (బాలికల టీజీఎస్ ఆర్‌జేసీ- నిర్మల్)కు ఎంపికయ్యారు. విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం అభినందించింది.

అనుమతి లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొన్ని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గోపాల్, ప్రవీణ్, అఖిల్‌లు పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

మంచిర్యాలక్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజ్‌రోడ్డుకు చెందిన ముక్తప్రసాద్ ఇంటిలో బంగారి నగలు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ ప్రవీన్ కుమార్ తెలిపారు. ముక్త ప్రసాద్ ఇందారంలోని రేషన్‌షాపునకు అతనితో పాటు ఆయన భార్య కూడ వెళ్లారు. ఇంటి పక్కన ఉన్న కిరాయికి ఉండే చంద ప్రసన్న లక్ష్మీకి ఇంటితాళం ఇచ్చేవారు. ఈ నెల 22న ఇంటితాళం చెవి ఇచ్చి ఊరికి వెళ్లి వచ్చారు. మరుసటి రోజు బీరువాలో రూ.7లక్షల బంగారు ఆభరణాలు కనబడలేదు. ప్రసన్నలక్ష్మీతో పాటు మరో వ్యక్తిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

బెల్లంపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కాం గ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. యువతీ, యువకులకు, నాయకులందరి కి ప్రాధాన్యత ఇస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత ఉన్నత స్థానానికి తీసు కెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ముచ్చర్ల మల్లయ్య, టీపీ సీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, బండి రాము పాల్గొన్నారు.

జన్నారం: టీపీసీసీ అధ్యక్షుల మహేశ్ జన్మదిన సందర్భంగా మండల కాంగ్రెస్ శ్రేణులు శనివారం మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బల హీనవర్గాల సంక్షేమం కోరుకుంటుందని కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసే ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ పార్టీకి చేస్తున్న సేవలు మరువలేని దన్నారు. ఆయన హయాంలో పార్టీ మరింత బలపుతుందన్నారు. కాంగ్రెస్ మండల నాయ కులు సయ్యద్ ఫసీవుల్లా, ఇందయ్య, రమేష్, సుదీర్, లక్ష్మీనారాయణ, మోహన్ రెడ్డి, ఇసాక్ పాల్గొన్నారు.

భారంగా.. ప్రైవేట్ విద్య

ప్రైవేటు పాఠశాలల్లో ప్రారంభమైన చేరికలు

పుస్తకాలతో సహా అన్నీ కొనాల్సిందే



మంచిర్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): సామాన్య జనాలకు ప్రైవేటు విద్య భారంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మరో పక్షం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో హడావుడి చేస్తున్నాయి. ఓ వైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా, ప్రైవేట్ స్కూళ్లలో మాత్రం అడ్మిషన్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల కోసం బడిబాట కార్యక్రమం ప్రారంభించే లోపే వీలైనంత ఎక్కువగా అడ్మిషన్లు సేకరించాలనే లక్ష్యంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఉన్నాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి సరిపడా విద్యార్థులను నింపుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అడ్మిషన్ టెస్ట్‌ల పేరుతో విద్యార్థులను చేర్చుకొనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా ముందస్తుగా పుస్తకాలు, యూనిఫాం, తదితర వస్తువులను అంటగడుతున్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండగా ఇప్పటి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం సమాయత్తం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


చుక్కలనంటుతున్న ధరలు...

పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి. అనేక చోట్ల పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు మొదలుకొని, బూట్ల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయట మార్కెట్‌తో పోల్చితే పాఠశాలల్లో విక్రయించే వివిధ సామగ్రి ధరలు అధికంగా ఉంటున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. పుస్తకాలతో సహ విద్యార్థి ధరించే యూనిఫాం, స్నాక్స్, బూట్లు, బెల్టుపై తమ పాఠశాల పేరే ఉండాలనే నిబంధన ఉండటంతో తల్లిదండ్రులు ధరలు ఎక్కువైనా కొనక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబంలో ఇద్దరు పాఠశాలకు వెళ్లే పిల్లలు ఉన్న చోట రూ. 15 వేల నుంచి 20 వేల వరకు కేవలం వస్తువుల కొనుగోలుకే వెచ్చించాల్సి వస్తుందని పలువురు పోష కులు వాపోతున్నారు. యాజమా న్యాల వైఖరితో మధ్యతరగతి వర్గాల ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలోనూ పూర్తి ఉచిత బోధన లభిస్తున్నప్పటికీ చదువులో నాణ్యత ఉండదనే భావనతో అత్యధిక మంది అష్టకష్టాలు పడి తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలోనే చేర్పిస్తున్నట్లు తెలుస్తోంది.

సామాన్యులకు భారంగా..



విద్యార్థుల తల్లిదండ్రుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుంటున్న కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ పరంగా ఎలాంటి అజమాయిషీ లేకపోవడంతో యాజమాన్యాలు ఆడిందే ఆటగా సాగుతోంది. ఆంగ్ల మాధ్యమంలో ఎల్‌కేజీ అభ్యసించే విద్యార్థికి సంవత్సరానికి కనీసం రూ. 20 వేలు వసూలు చేస్తుండగా ప్రైమరీ...(మిగతా 6లో)



ప్రత్యేక చర్యలు

అభివృద్ధి పనులకు అటవీ అనుమతుల జారీకి

రాష్ట్ర, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

మంచిర్యాల కలెక్టరేట, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులలో అవసరమైన అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రిన్సిపల్ చీఫ్ అబ్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సువర్ణ, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అహ్మద్‌నదీం, ఉమ్మడి జిల్లా ప్రతినిధులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు అటవీ అధికారులు, ఇతర అధికా రులతో అభివృద్ధిలో భాగంగా అటవీ అనుమతుల జారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి పనులలో అవసరమైన అటవీశాఖ అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అటవీ అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సరఫరా, విద్యుత్, పాఠశాలలు, ఆసుపత్రులు ఇతర ప్రజా ప్రయోజనకర అభి వృద్ధి పనులకు సమర్పించిన ప్రతిపాదనల సంబంధిత అనుమతుల జారీకి ముందస్తు ప్రదాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి మం త్రి మాట్లా డుతూ సమాజంతో పోలిస్తే అటవీ ప్రాంతాల్లో నివసిం చే ఆదివాసీ గిరిజనులు అభివృద్ధి వెనుకబడి ఉన్నారని, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ ప్రాంతాలలో పోడుభూముల్లో వెదురు మొక్కల పెంపకంపై గిరిజనులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకుంటామని ఇందుకు నర్సరీల్లో వెదురు మొక్కలను అభివృద్ధి చేస్తామని సరిపడా మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలశాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



ప్రభుత్వ కళాశాల, పాఠశాల భవన నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

లక్షెట్టిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వైద్యం పైనే ప్రత్యేక దృష్టితో ముందుకు సాగు తోందన్నారు. మన ప్రాంతంలో అన్ని ప్రభుత్వ పాఠశా లల్లో ఆంగ్ల మాధ్యమం ఉండేట్లు కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ముందుగా ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తాను గెలిచ నాటి నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలకు నిధులు సమకూర్చామని అంతే కాకుండా డీఎంఎఫ్‌టీ నిధులు ప్రత్యేకంగా విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని బడుల్లో మౌలిక వసతులకు నిధులు సమకూర్చామన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య కొన్ని పాఠశాలల్లో తక్కువగా ఉందని ఒక్కో టీచర్ సుమారు 16సబ్జెక్టులు చెప్పడంతో ఇబ్బంది పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఎంఈ వో శైలజ, రిసోర్స్ పర్సన్స్ పింగిళి వేణుగోపాల్, బండ శ్రీనివాస్, గిరిధర్, చంద్రశేఖర్, తిరుపతి, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మాణం పనుల పరిశీలన

లక్షెట్టిపేట పట్టణంలో నిర్మిస్తున్న 30పడకల ఆసుపత్రితో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల భవన నిర్మాణం పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజికవర్గ ప్రజలకు ఒక్క పైసా ఖర్చు లేకుండా పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కావాల్సిన వసతులు, సామగ్రిని ఆ శాఖ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి వైద్యులు సురేష్, స్రవంతి, పవిత్ర, కృష్ణ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, సీనియర్ నాయకులు చెల్ల నాగభూషణం, పూర్ణచందర్‌రావు, దేవేందర్‌రెడ్డి, నలిమెల రాజు, గుత్తికొండ శ్రీధర్, నవాబ్, షాహెద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



మాతా శిశుకేంద్రం వద్ద వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగ్‌రావు అన్నారు. శనివారం మాతాశి శుకేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో వైద్యం అందించేందుకు కావాల్సిన పరికరాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించి గర్భిణి, బాలింతలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం



చెక్కు అందజేస్తున్న సంఘం ఉపాధ్యాయులు

దండేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూటీఎస్‌తోనే సాధ్యమని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేసిన రమాబిందు ఇటీవల మృతి చెందారు. ఆమె పీఆర్‌టీయూటీఎస్‌లో క్రియాశీల సభ్యత్వం పొందగా ఆమెకు మంజూరు అయిన లక్ష రూపాయల బీమా చెక్కును తన భర్త గజ్జెల ప్రభాకర్‌కు శుక్రవారం దండేపల్లిలో సంఘం బాధ్యులు అందజేసారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడు కోండు జనార్దన్, మండల అధ్యక్షకార్యదర్శు రావణవేని రవి, మల్యాల మల్లేష్, నాయకులు కట్ట రాజమౌళి, నిచ్చకోల మహేశ్వర్, తనుగుల రాజమౌళి, లశెట్టి సురేందర్, ఆవుల నరసింహులు, సతీష్ పాల్గొన్నారు.

పాఠశాలల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్

మంచిర్యాలకలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవలేబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ జిల్లా ఎస్‌సీ డీడీకి తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీవీవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవలేబుల్ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన ఫీజుల బకాయిలు మూడేళ్లుగా చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపాల్, సాగర, సాల్మన్ పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జైపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకులు, ఉపాధ్యాయుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గురుకులాల డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ కోల నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అన్ని సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులను నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28లోగా దరఖాస్తులను సమర్పించాలని, ఈ దరఖాస్తులను ప్రతి గురుకుల పాఠశాలలో స్వీకరిసారన్నారు. జరుగుతుందన్నారు. ఈ నెల 29న డెమో ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 9704550168లో సంప్రదించాలన్నారు.

లక్షెట్టిపేటలో భారీ వర్షం

లక్షెట్టిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలో శనివారం మధ్యాహ్నం సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షానికి 11వ వార్డు గోదావరి రోడ్డులోని పలువాడల్లో డ్రైనేజీలు నిండి మురికి నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మురికి నీరు ఇండ్లలోకి చేరుతుండడంతో రానున్న రోజుల్లో వర్షాకాలం పరిస్థితులు ఏంటని కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందిని అప్రమత్తం చేసి డ్రైనేజీలను శుభ్రం చేయించారు.

ఎంపీని అవమానించినందుకు నిరసన



నిరసన తెలుపుతున్న ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు

చెన్నూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకుండా, ఎక్కడా ఫొటో పెట్టకుండా అవమానించడాన్ని నిరసిస్తూ ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత ఎంపీ అయిన వంశీకృష్ణ ఫొటో పెట్టకుండా, ఆయనను ఆహ్వానించకుండా స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అవమానించారన్నారు. వెంటనే ఎమ్మెల్యేపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రోటోకాల్ పాటించని దేవాదాయ శాఖ చీఫ్ సెక్రెటరీని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, వెంకటి, జనగామ తిరుపతి, లింగంపల్లి మహేష్, దుర్గం వెంకటి, దాసరి కమలాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం



బాక్సింగ్‌పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలకలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శనివారం జూనియర్, సబ్‌జూనియర్, యూత్‌లేవల్ బాలబాలికల టైసన్ కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలకు 23 జిల్లాల నుంచి క్రీడాకారులు, క్రీడాకారిణులు హాజరయ్యారు. మూడు రోజులు పాటు నిర్వహించే పోటీల్లో భాగంగా శనివారం పలు క్రీడాకారులు తలపడ్డారు. ఇంకా రెండు రోజులు కొనసాగుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లా క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి పురుషోత్తం నాయక్, బాక్సింగ్ నిర్వాహకులు చిలువేరు రాజేశ్ పాల్గొన్నారు.

గ్రామపాలన అధికారుల పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

మంచిర్యాల కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జరుగ నున్న గ్రామపాలన అధికారుల రాత పరీక్షను పకడ్బందీగా నిర్వ హించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శనివా రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఈ నెల 25న ఉదయం 10.30గంటల నుంచి 1.30 నిమిషాల వరకు జరుగనున్న పరీక్షను ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష నిర్వహణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల తరలింపు, స్ట్రాంగ్‌రూం, బందోబస్తు, పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అన్ని ఏర్పాట్లపై చర్యలు తీసుకునేవిధంగా అధికారులను ఆదేశించామన్నారు. విద్యుత్ సరఫరా, వైద్యా ఆరోగ్యశాఖ అధికారులకు విద్యుత్‌కు అంతరాయం లేకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ, తహసీల్దార్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ నుంచి పోలీసుశాఖ పరీక్ష సామగ్రి తీసుకరావడం, ముఖ్య పర్యవేక్షకుల ఆధ్వర్యంలో జవాబుపత్రాల సీలింగ్, పాకింగ్ ప్రక్రియపై చర్యలు తీసుకుంటామన్నారు. సిట్టింగ్‌స్క్వాడ్, పరీక్ష నియమనిబంధనలు అమలు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో పరీక్షకు 155 మంది హాజరవుతున్నారని పరీక్ష కేంద్ర సమీ పంలో 163 సెక్షన్ జీఎంఎస్ అమలు చేస్తున్నామన్నారు. పరీక్ష సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, మంచిర్యాల ఎంఆర్వో రఫాతుల్లా, సత్యనారాయణ, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళలకు కుట్టు మిషన్ అందజేస్తున్న సంస్థ సెక్రెటరీ, సభ్యులు

దండేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి):కుట్టు మిషన్ ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఔట్ రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ సెక్రెటరీ కెరోలిన్‌విగ్ అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్‌లో గత ఐదు నెలల నుంచి సహృదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా అందజేస్తున్న కుట్టు శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన మహిళలు జీవితంలో రాణిచాలని మహిళలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడం కోసం మహిళల ఉపాధి కోసం సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రమోహన్, లలిత, సంతోషి పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

జన్నారం, మే24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని అక్కపల్లి గూడెం గ్రామానికి చెందిన గోలి రాజన్న(52) సైకిల్‌పై వస్తుండగా చెక్క పల్లికుంట చెరువు వద్ద ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలపై చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజవర్దన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. చెక్కపల్లికుంట చెరువు వద్ద రేండ్లగూడ వైపు నుంచి జన్నారం వస్తున్న ఆటో డ్రైవర్ బాలావత్ జనంత్‌రావు రాజన్న సైకిల్‌ను వెనకభాగంలో ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డుపై నీళ్లలో కూరుకపోయిన కారు

క్రాసిపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సోమగూడెం, దేవాపూర్ ప్రధాన రహదారి కొండాపూర్ యాప వద్ద శనివారం కారు నీటి గుంతలో కూరకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. మంచిర్యాల నుంచి ధర్మరావుపేటకు కుటుంబంతో కారులో వస్తుండగా కొండాపూర్ యాప ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిగుంతలో కారు కూరుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి కారును ఆపారు. స్థానికులు గమనించి ట్రాక్టర్ సాయంతో కారును బయటకు లాగారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

కోటపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొయ్యలపల్లి గ్రామంలోని 1వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో దొంగతనం జరిగింది. కేంద్రంలోని వెనక తలుపు పగులగొట్టి చొరబడినట్లు అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేంద్రంలోని పప్పులు, నూనె ప్యాకెట్లు, కోడిగుడ్లను దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొంది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరస్వతి పుష్కరం.. సకలజన హితం


సోపానాల్లో దీపాలు వదులుతున్న భక్తులు



- త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తజనం
- పదో రోజు 2 లక్షలకుపైగా హాజరైన భక్తులు

కాళేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కర సంబరం సాగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి అశేష భక్తజనం కాళేశ్వర క్షేత్రానికి పోటెత్తుతున్నారు. శనివారం పదో రోజు వివిధ ప్రాంతాలనుంచి సుమారు 2 లక్షలపైచిలుకు భక్తులు కాళేశ్వరంలో పుష్కర స్నానాలు ఆచరించి ముక్తీశ్వరుడిని కృపకు పాత్రులయ్యారు. భక్తులు రద్దీ అధికమై దర్శనానికి గంటలకొద్దీ సమయం పట్టడంతో క్యూలైన్‌లో వేచిచూడలేని భక్తులు కొంత మంది పుష్కర స్నానాలతో సరిపెట్టుకొని వెనుదిరిగి వెళ్లారు. పార్కింగ్ స్థలాలు సుదూరంగా ఉండటంతో కొంత మంది వాహణదారులు ఇబ్బందులు పడ్డారు. పలువురు ప్రముఖుల కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి పుష్కర స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆది, సోమ రెండు రోజులతో పుష్కరాలు ముగియనుండటంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే ఛాన్స్ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సర్వసతి పుష్కరాల పదో రోజులో భాగంగా శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఅండ్ఎండీ ఐఏఎస్ అధికారి కృష్ణ భాస్కర్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వరాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన 10రోజుల్లోనే 10 లక్షల పైచిలుకు మంది భక్తజనం పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరసాన్నం ఆచరించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు ఆదివారం రానున్నారు.


ఎడ్లబండ్లపై పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు



మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్నాం

బెల్లంపల్లి, మే24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో భా గంగా అమలు చేస్తున్న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్షులు కట్ట రామ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మే 27న హైదరాబాద్‌లో నిర్వహించే ఆటో డ్రైవర్ల ఆకలికేకలు బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఉపాధి దెబ్బతిన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెల రూ. 15వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఉపాధి దెబ్బ కొట్టేలా తీసుకున్న పథకాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి లేక ఎంతో మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవద్దనే ఉద్దేశంతో 33 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే ఆటో డ్రైవర్ల ఆకలికేకల మహా గర్జనను ఆటో డ్రైవర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

భారంగా..ప్రైవేటు విద్య

(5వ పేజీ తరువాయి)

తరగతుల స్కాలర్‌కు రూ. 20 వేల నుంచి 50 వేలు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు వేలల్లో అడ్మిషన్ ఫీజులు సైతం వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరిస్తున్నారు. హాస్టళ్లలో ఉండి చదువుకు(కొ)నే వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సంవత్సరానికి ఒక్కో విద్యార్థికి రూ. 80 వేలపైనే వసూలు చేస్తున్నారు. దీంతో పాటు కొన్ని పాఠశాలల్లో నోటు పుస్తకాలు, టెక్ట్స్ బుక్కులు, యూనిఫాంలు, సాక్సులు, టీషర్టులు అమ్ముతున్నారు.

కనీస సౌకర్యాల కల్పించడంలో విఫలం...

వేల రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలు ఉండగా చాలా వాటికి విద్యార్థులు ఆడుకునేందుకు ఆటస్థలం లేకపోవడం శోచనీయం. రెండు మూడంతస్థుల్లో పాఠశాలలు నడుపుతూ విద్యార్థులను క్రీడలకు దూరం చేస్తున్నా అడిగేవారు కరువయ్యారు. ప్లే స్కూళ్ల పేరిట పాఠశాలలు నిర్వహిస్తూ ప్రీ ప్రైమరి తరగతుల విద్యార్థులకు ఇరుకు గదిలో ఆట వస్తువులు ఏర్పాటు చేసి కుక్కుతున్నారు.

నిబంధనలు అమలయ్యేనా...?

2025-26 విద్యా సంవత్సరం ఆరంభం కానుండగా, ప్రైవేట్ స్కూళ్లలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టవలసిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నందున నిబంధనలపట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు విధిగా ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండటం, క్రీడా మైదానం ఏర్పాటు, అగ్నిమాపకశాఖ పరికరాల ఏర్పాటు విషయంలో వెసులుబాటు కల్పించవద్దనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తవుతున్నాయి.

సంక్షిప్త సమాచారం

చెన్నూరు : మండలంలోని ఆక్కెపల్లి గ్రామంలో శనివారం రైతులకు వానాకాలం పంటల సాగుపై ఏడీఏ బానోత్ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఏయే పంటలు సాగు చేయాలో ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో వివరించారు. ఏఈవో యామిని, ఏఈవో రాజశేఖర్, కార్యదర్శి సిరాజ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో ముత్యం తిరుపతి సూచించారు. శనివారం మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. 50 మంది రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీ అగ్రిసాక్ యాప్‌లో నమోదు చేశారు. రైతులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ఏరియా రక్షణాధికారిగా ఎస్ఆర్‌పీ 1 మేనేజర్‌గా (డీవైజీఎం హోదా) పనిచేస్తున్న విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు యాజమాన్యం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఇతర అధికారులు సైతం బదిలీ అయ్యారు.

నెన్నెల : నెన్నెలప్రాథమిక పాఠశాల సమ్మర్ క్యాంపులో చదువుకుంటున్న విద్యార్థులకు పూదరి సత్యనారాయణగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కొడుకు పూదరి నరేష్‌గౌడ్ పరీక్షప్యాడ్లు, బుక్కులు, పెన్నులు శనివారం అందజేశారు. క్యాంపు నిర్వహకులు కొండపర్తి వెంకటేష్ సూచన మేరకు పిల్లలకు అవసరమైన వస్తువులు ఇచ్చామని నరేష్ గౌడ్ చెప్పారు. పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు విజయవంతంగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

భీమారం : ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా మండల కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు శనివారం జాతీయ జెండాలతో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈవో వేణుగోపాల్‌రావు, పాల్గొన్నారు.

బెల్లంపల్లి: నిరుద్యోగులకు పట్టణంలోని సాం ఘీకసంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తెలిపారు.

మంచిర్యాలక్రైం: ఉపాధ్యాయులు పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీపీఏ జిల్లా అధ్యక్షులు వనిత వాక్కు వ్యవస్థాపక అధ్యక్షులు అడ్వకేటు రంగు వేణుకుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రభుత్వ హిందీ పండిట్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కేపాసిటి బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు.

ఆసరా పింఛన్‌లను వెంటనే పెంచాలి

మందమర్రిరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పింఛన్‌లను వెంటనే పెంచాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్, బీఎస్పీ నాయకులు ముల్కల రాజేంద్ర ప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం మండల తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందిచారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్‌ను ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వడం లేదన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పింఛన్‌ల పెంపుపై చొరవ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి పింఛన్‌లు పెరిగేలా కృషి చేయాలన్నారు. పింఛన్‌లు పెంచకపోతే రాబోయే రోజుల్లో రాస్తారోకో, ధర్నా చేస్తామని పేర్కొన్నారు.

పెంచి ఇస్తామన్న పింఛన్ల కోసం ఎంతో మంది పేదలు ఎదురు చూస్తున్నారని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ, టీడీపీ పట్టణ మహిళ అధ్యక్షురాలు రాయమల్ల జయ, ప్రధాన కార్యదర్శి జూపాక సంధ్య, కవిత, రాజేష్, సత్య నారాయణ, రంగనాద్, రమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి పెంపొందించేలా పాఠాలు చెప్పాలి

దండేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తి పెంపొందించేలా పాఠాలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో దుర్గం చిన్నయ్య సూచించారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలోని శనివారం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 5రోజుల పాటు ఇచ్చిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎంఈవో హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగు పర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేసవి శిక్షణ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ బొలి శెట్టి బుచ్చన్న, లక్ష్మణచారి, మండల రిసోర్స్ పర్సన్లు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని ఉపాధ్యాయులకు వేమనపల్లిలో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎంఈవో శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యా వ్యవస్థలో విద్యార్థుల అభ్యాసన స్థాయిలను మెరుగు పర్చడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు శంకర్, వినయ్‌కుమార్, సంతోష్, అనూష, శ్రీకాంత్ ఉన్నారు.

బొగ్గు ఆధారిత ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

శ్రీరాంపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఆధారిత ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తెలంగాణ నెట్ జీరో భవిష్యత్తు కోసం జస్ట్ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్ అంశంపై స్వణితి ఇనిషియేటివ్, సింగరేణి సంస్థలు సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలలోని బొగ్గు ఆధారిత ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించి, ఆర్థిక వైవిధ్యీకరణకు గల అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ అభివృద్ధికి రెండు సంస్థల నడుమ సహకారం అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం స్వణితి ఇనిషియేటివ్ రిసెర్చ్ ఫెలో రిషికిషోర్ జస్ట్ ట్రాన్సిషన్ భావనతో నెట్ జీరో లక్ష్యాల వైపు దేశం చేస్తున్న ప్రయాణాన్ని, బొగ్గు గనుల మూసివేత మార్గదర్శ కాల గురించి వివరించారు. స్వణితి అసోసియేట్ ఫెలో దీక్షా పాండే, సాయి చంద్ర తెలంగాణపై చేసిన అధ్యయన ఫలితాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రతినిధి శ్రీరామ్ కోలాసాని తమ ఉద్దేశాలను అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఓటు జీఎం శ్రీధర్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



జీఎం కార్యాలయంలో సమావేశమైన అధికారులు



ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయాలి

శ్రీరాంపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేయాలని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ బి. జనక్‌ప్రసాద్ ఆదేశించారు. యూనియన్ కోర్ కమిటీ సమావేశం రసూల్‌పల్లిలోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో పిట్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బదిలీలకు సంబంధించి యాజమాన్యం కక్షపూరితంగా సర్క్యులర్‌ను విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. ఇది కార్మికులను బెదిరింపులకు పాల్పడడమేనని చెప్పారు. ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్, సొంతింటి పథకం, వడ్డీలేని రుణం, తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర నాయకులు సీహెచ్.భీంరావు, గరిగె స్వామి, తిరుపతిరాజు, పేరం రమేష్, జీవన్ జోయల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, చాట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ప్రగతికి పాటుపడాలి

మందమర్రిటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): సంస్థ ప్రగతికి ఉద్యోగి, అధికారి పాటు పడాలని కార్పొరేట్ ఐఅండ్‌పీఎం జీఎం మధుసూదన్‌రావు అన్నారు. శనివారం మందమర్రి ఏరియాను ఆయన సందర్శించారు. జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఉత్పత్తిపై ప్రభావం ఉన్నా దాన్ని అధిగమించేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్లాన్నారు. ఓసీపీల్లో వర్షం నీరు నిలిస్తే తొలగించే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. అధికారులు సమావేశాలు నిర్వహించుకుంటూ అధిక ఉత్పత్తి సాధ నకు కృషి చేయాలన్నారు. మొదటిసారిగా మందమర్రి ఏరియాకు చెందిన ఆయనను జీఎం, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, పీఎం శ్యాంసుందర్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, అధికారులు ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పది రోజుల సమయం మాత్రమే ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జీఎం దేవేందర్ తెలిపారు. శనివారం స్థానిక జీఎం కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు.

వేడుకల రోజున సింగరేణి సీఎండీ బలరాం సందేశం చదివి వినిపించారు. స్టాళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు, సంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. అన్ని డిపా ర్టుమెంట్ల అధికారులు పరస్పరం సహకరించుకుంటూ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీఎం శ్యాం సుందర్, గ్రూపు ఏజెంట్ ఖాదిర్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న, డీవైపీఎం పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాయల్ టాకీస్ నుంచి ఎస్ఆర్‌పీ 3 గనికి వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2వ, 3వ బదిలీలకు వెళ్లే కార్మికులు వెలుతురు లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రహదారికి రెండువైపులా చెట్లు ఉండడం, ఇసుక బంకర్, గోదాంలు ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై


సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి — వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



నవతరం నాయకుడు వచ్చాడు

శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్


అర్ష్‌దీప్


సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్‌ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.



5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇక 'శుభ్' ఆరంభం!

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఎ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్విందర్ కృషి ఎనలేనిది. కొడుకు దృష్టంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.



ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటున్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పౌలినీ, రెండో సీడ్ కోకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్దీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్ట్‌లు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్ట్‌లు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్ట్‌లు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..


తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్దీత గడువులోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

అప్పుడే కనిపించిన ఆరుద్ర



ఆరుద్ర కార్తెలో విరివిగా కనిపించే ఆరుద్ర పురుగులు ఈ సారి కాస్త ముందుగానే కనిపించాయి. ఏటా వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఆరుద్ర కార్తెలో మాత్రమే ఈ ఎర్రటి దూదిలాంటి పురుగులు కనిపిస్తూ ఉంటాయి. కానీ ఈ సారి మే నెలలోనే వర్షాలు కురుస్తుండడంతో చింతలమానేపల్లి మండల శివారు ప్రాంతాల్లో ఉన్న పంట చేలల్లోని నేలలో నుంచి బయటకు వచ్చి తిరుగుతూ చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

- చింతలమానేపల్లి, ఆంధ్రజ్యోతి

గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), మే 24(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం జోన్‌లో గల కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాలోని 25 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి తాత్కాలిక పద్ధతిన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి డి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో గల ఖాళీల మేరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్(లాంగ్వేజెస్), జూనియర్ లెక్చరర్‌ఉపీజీటీ/టీజీటీ, హెల్త్ సూపర్‌వైజర్ పీఈటీ, పీడీల ఎంపికకు ఈ నెల 29న డెమో నిర్వహించ నున్నామని పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్, సైన్స్ సోషల్, లైబ్రేరియన్ వంటి వాటికి 30న జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో డెమో నిర్వహించనున్నామని తెలిపారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

రెబ్బెన, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై శనివారం జీఎం కార్యాలయంలో జీఎం విజయభాస్కర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. జూన్ 2వ తేదిన నిర్వహించనున్న వేడుకలను ఎజెండా, నిర్వహణ బాగుండాలని ఆదేశించారు. వేడుకల కోసం శ్రీ భీమన్న మైదానం, జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం కె.రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణమూర్తి, డీజీఎం(స్టోర్స్) శ్రీనివాస రావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- పండ్లు, కూరగాయలు, పూల తోటల సాగుపై ప్రభుత్వం దృష్టి
- బిందు, తుంపర సేద్యానికి రాయితీలు
- రైతులకు అవగాహన కల్పించనున్న అధికారులు



ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2025-26సంవత్సరానికి వార్షిక ప్రణాళిక ఖరారు చేసింది. జిల్లాకు రూ. 7.68 కోట్లు కేటాయించింది. ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించవచ్చనే ఉద్దేశంతో రాయితీలు అందిస్తోంది.



అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి

బెజ్జూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలను తక్కువ నీటితో సాగు చేయవచ్చు. ఈ పంటల సాగుకు కొంత పెట్టుబడి పెడితే నిత్యం లాభాలు ఆర్జించవచ్చు. దీంతో ఉద్యాన పంటల సాగును పెంచేందుకు ప్రభుత్వం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సదస్సులో పంటల సాగుతో కలిగే లాభాలతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించనున్నారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2025-26సంవత్సరానికి వార్షిక ప్రణాళిక ఖరారు చేసింది. జిల్లాకు రూ. 7.68 కోట్లు కేటాయించింది. ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించవచ్చనే ఉద్దేశంతో విరివిగా రాయితీలు అందిస్తోంది. అకాల వర్షాల కారణంగా నష్టాలు చవిచూసిన, తక్కువ ఆదాయం గల పంటలు సాగు చేస్తున్నవారు, పంట మార్పిడి చేసి అధికాదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల కోసం ఈ రాయితీలు కల్పిస్తోంది. ఈ సంవత్సరం వార్షిక ప్రణాళిక అమలు ప్రక్రియను జిల్లా అధికారులు ప్రారంభించారు. ఆసక్తి గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి అబ్దుల్ నదీం తెలిపారు.

● 31 హెక్టార్లలో రాయితీ..

డ్రాగన్ ఫ్రూట్, అరటి, అంజీర, అవకాడో, బొప్పాయి, ఉసిరి, మామిడి, నిమ్మ, జామ, హైబ్రీడ్ కూరగాయలు, పూల తోటల పెంపకానికి 31హెక్టార్లలో రాయితీ కల్పిస్తున్నారు. ముదురు మామిడి తోటల పునరుద్ధరణకు 10హెక్టార్లు, మల్చింగ్ షీట్ వేసుకున్నందుకు 40హెక్టార్లు, ఉద్యాన యాంత్రీకరణకు 34 యూనిట్లు, అదే విధంగా వెదురు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వెదురు మొక్కలు నాటిన రైతులకు రాయితీ కల్పిస్తోంది. జిల్లాకు 80ఎకరాల్లో రూ. 11.52లక్షల ఆర్థిక లక్ష్యంగా నిర్ణయించారు.

● మొదటి విడతగా..

బిందు సేద్య(డ్రిప్) పరికరాల కోసం జిల్లాకు మొదటి విడతగా రూ. 88.30కోట్ల అంచనాతో 100ఎకరాల భౌతిక లక్ష్యాలు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ కులాల రైతులకు 100శాతం, బీసీ, సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతరులకు 80శాతం రాయితీ కల్పించారు. డ్రిప్ కోసం రైతులు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కూరగాయల సాగు పెంచేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రూ. 10లక్షలు కేటాయించారు. ఈ మేరకు 20 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

● ఆయిల్ పామ్ సాగు..

కోతులు, దొంగల బెడద లేని ఏకైక పంట ఇది. 35ఏళ్ల పాటు దిగుబడి ఇచ్చే ఆయిల్‌పామ్ సాగును జిల్లాలో ఈ ఏడాది 1000ఎకరాల్లో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో బాగంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మ్యాట్రిక్స్ కంపెనీ మొక్కలను అందిస్తున్నాయి. వీటికి రూ. 4.20కోట్లు రాయితీతో పాటు నిర్వహణ రాయితీ, అంతర పంటలకు ఎకరానికి రూ.4200చొప్పున సబ్సిడీ ఇస్తారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి..

- అబ్దుల్ నదీం, జిల్లా ఉద్యాన అధికారి



రైతులకు పంటల మార్పిడిపై అవగాహన కల్పిస్తున్నాం. వారిని ఉద్యాన పంటల సాగు వైపు మళ్లించడమే లక్ష్యంగా తోటల సాగుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరిస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సర లక్ష్యం చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. తోటల సాగుకు 40శాతం నుంచి 100శాతం వరకు రాయితీ ఇవ్వనున్నాం. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

బడిబాటను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 31వ వరకు నిర్వహించే బడి మనదే- బాధ్యత మనదేలో బాగంగా నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. స్థానికంగా శనివారం ఆమె మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బడి బాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గుణాకర్, రాహుల్, హిమబిందు, జ్యోతి, సవిత, ప్రవీణ్, కౌడు, అతీష్, శుభా నుషు, రజియా, సుల్తానా పాల్గొన్నారు.

మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

బెజ్జూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి మంచిర్యాలకు అక్రమంగా తరలిస్తున్న మూడున్నర కిలోల గంజాయిని బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలోని సులుగుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై మహారాష్ట్ర నుంచి మూడున్నర కిలోల గంజాయిని తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు కుశ్నపల్లి గ్రామ సమీపంలో తనిఖీలు చేపట్టగా పట్టుబడిందన్నారు. దీని విలువ రూ.86,970 ఉంటుందని, పట్టుబడ్డ గంజాయిపై విచారించగా మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహేంద్ర అనే వ్యక్తి నుంచి తీసుకు వచ్చి మంచిర్యాలలోని రాజు అనే వ్యక్తికి చేరవేస్తే రూ.10 వేలు ఇస్తామని చెప్పడంతో సరఫరా చేసినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి సంతోష్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన



కొట్టుకుపోయిన గుండి పెద్దవాగు తాత్కాలిక వంతెన

ఆసిఫాబాద్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామానికి వెళ్లే దారిలోని పెద్దవాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. శనివారం ఉదయం గుండి గ్రామం నుంచి ఆసి ఫాబాద్ వైపు వస్తున్న ఆటో అదుపు తప్పి వరదలో కొట్టుకుపోయింది. వరద ఉధృతికి ఆటో అదుపు తప్పడంతో అప్రమత్తమైన ప్రయాణికులు ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని గుట్టకు చేరారు. ఏళ్ల తరబడి వంతెన పూర్తి కావడంతో అక్కడి ప్రజలు అధికారులపై, ప్రజాప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈదురుగాలులు.. వర్షం

చింతలమానేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరులుతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టడా నికి అనుకూలంగా ఉంటుందని, జూన్ 8న విత్తన పండ గ చేసుకొని సాగుకు శ్రీకారం చుడతామని రైతులు చెబుతున్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హత్తిని, దహెగాం, కల్వాడ, కుంచవెల్లి, అయినం, చంద్రపల్లి, గిరివెల్లి, ఖర్జీ, ఒడ్డుగూడ, లగ్గాం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులను ఆరబోశారు. మధ్యాహ్నం సమయంలో వర్షం కురియడంతో ధాన్యం తడిసి పోకుండా కవర్లను కప్పడానికి ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ(సీతక్క), పీసీసీఎఫ్ సువర్ణ, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అహ్మద్‌నదీం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, అటవీ అధికారులు, ఇతర అధికారులతో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనమతుల జారీ, అటవీ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పన, అటవీ నుమతుల మంజూరుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సరఫ రా, విద్యుత్, పాఠశాలు, అసుపత్రులు, ఇతర అభివృ ద్ధి పనుల కోసం సమర్పించిన ప్రతిపాదనల సంబం ధిత అనుమతుల జారీకి ముందస్తు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల పరిధిలో చేపట్టే రహదారి నిర్మాణ పనులకు అటవీ శాఖ అధికారులు అవసరమైన అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగేలా చూడాలని తెలిపారు. ఆయా జిల్లాల అటవీ అధికారులతో సమీక్షించి చేపట్టిన చర్యలు, పనుల పురోగతిపై ఈ నెల 28వతేదీలోగా నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఇతర అధికారులతో హాజరై మాట్లాడారు. అటవీ అనుమతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

పులిని హతమార్చిన కేసులో 30 మంది రిమాండ్

పెంచికలపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): పులిని హత మార్చిన కేసులో ప్రమేయం ఉన్న 30 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుకదేవ్ బోడాడే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేట రవెన్యూ పరిధిలోని ప్రాంతంలో ఈ నెల 14న విద్యుత్ తీగలు అమర్చి పులిని హతమార్చి చర్మం, గోర్లు, మీసాలు, దంతాలు తీసుకెళ్లారరని చెప్పారు.. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని, కేసులో ప్రమేయం ఉన్న 30 మందిని సిర్పూర్(టి) సివిల్ కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల జుడిషియల్ కస్టడి విధించినట్లు తెలిపారు. వారిని ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు వివరించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న అప్పాజీ శ్రీనివాస్, అప్పాజీ వెంకటేష్, ఎల్కుర్ శేఖర్, రోహిణి శ్రవణ్, చప్పిడి అశోక్, చాపిడే పవన్‌కుమార్, ఎల్కురి ప్రకాష్, బుర్రి వెంకటేష్, కాటేల సాగర్, నికాడి వెంకటేష్, లాత్కురి శ్రీనివాస్, భీంకారి వెంకటేష్, భీంకారి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఒంగ్రె సంతోష్, తుమ్మిడి శ్రీనివాస్, ఎల్కురి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓంగ్రె నిరాయణ, లేగల వెంకటేష్, గోమాసి రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ, ఎల్లూరి లచ్చన్న, మౌల్కర్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమ్మిడే సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బాలభారతి ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలుసుకున్నారు. 20 సంవత్సరాల క్రితం కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు గోవింద్‌రావు, గంగాధర్, చారి, జావీద్‌ను సన్మానించారు..

గ్రామ పాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25న నిర్వహించనున్న గ్రామ పాలన అధికారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంఅన్ని జిల్లాల కలెక్టర్‌లతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగనున్న గ్రామ పాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ భవన వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి, మే 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని బనారకోసార వాగును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ నది పరివాహక ప్రాంతాల ప్రజలు వాగులు దాటే సందర్భంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు నేరుగా కాకుండా పరిశీలించి వాగు దాటాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి నది పరివాహక ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఎగువ ఉన్న పాంతాల్లో వర్షం కురుస్తున్నప్పుడు లోతట్టు ప్రాంతాల్లో వాగులు పొంగే అవకాశం ఉంటాయని ప్రజలు వాగు దాటే సమయంలో జాగ్రత్తలు ఈసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట డీఎల్ పీవో ఉమర్, తహసీల్దార్ రియాజ్ అలీ, డీటీ శ్రవణ్, గిర్దావర్ మాజీద్ ఉన్నారు.

20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కాగజ్‌నగర్ టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో 60 లక్షల రూపాయలు విలువ చేసే 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు శనివారం పోలీసులు పట్టుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం ప్రకారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 20 క్వింటాళ్ల పత్తి విత్తనాలు పట్టుకొన్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆసిఫాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కాగజ్‌నగర్ కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ నకిలీ పత్తి విత్తనాలు అమ్మకాలు సాగిస్తున్నాడన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో అనుమానస్పదంగా వెళ్తున్న వ్యాన్ (ఏపీ 39 టీవై 9741ను తనిఖీ చేశారు. ఈ వ్యాన్‌లో 20 క్వింటాళ్ల (రూ. 60 లక్షల విలువ) నిషేధిత నకిలీ బీటీ 3 రకం విత్తనాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకొని నిందితుడు కొత్తపల్లి సదాశివ్‌ను విచారించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మర్రిగ డ్డకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి మహారాష్ట్రకు చెందిన సంతోష్‌కి షోర్ అనే మరో వ్యక్తి ద్వారా వాహనంలో కాగజ్‌నగర్ వైపు తరలి స్తున్నట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు వాహనాన్ని పత్తి విత్తనా లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్ (కర్నూల్ జిల్లా)ను అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలి పారు. సమావేశంలో డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు సందీప్, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన

ఆసిఫాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో చివరి రోజు శనివారం బాలల సంరక్షణాధికారి మహేష్ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. పోక్సో ఈ బ్లాక్ ద్వారా ఎలా ఫిర్యాదు నమోదు చేయాలో వివరించారు. లైంగిక దాడులకు గురైన బాలలను గుర్తించడానికి అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ వల్ల బోధన నైపుణ్యం మెరుగు పర్చుకోవడానికి ఉపయోగపడుతుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. . కార్యక్రమంలో ఆర్పీలు అమరేందర్‌రెడ్డి, అనురాధబాయి పాల్గొన్నారు.

వాంకిడి,(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం కెరమెరి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రకాష్ పాల్గొన్నారు.